క్లుప్తంగా

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు



కాజీపేట: చైతన్యపురి కాలనీ గోదాదేవి, పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి దేవాలయంలో గురువారం రాత్రి బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. ఆలయ ఆవరణలో మహిళలు వేయి దీపాలతో అలంకరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పంజాల అశోక్ కుమార్ గౌడ్, మేజర్ వడ్డెపల్లి నరేందర్, దిలీప్‌కుమార్ పాల్గొన్నారు.

కేయూలో యువకుడి అసభ్యప్రవర్తన

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని మహిళా హాస్టల్ సమీపంలో గురువారం ఓ యువకుడు తన ప్యాంట్ జిప్ విప్పుకొని అసభ్యంగా ప్రవర్తించాడు. విద్యార్థినులు కేయూ హాస్టళ్ల డైరెక్టర్ శ్రీనివాస్ రావుకు సమాచారం ఇచ్చారు. శ్రీనివాస్‌రావు సమాచారంతో పోలీసులు రంగప్రవేశం చేశారు. కాగా, అప్పటికే పలువురు విద్యార్థులు (బాయ్స్) అక్కడికి చేరుకొని సదరు యువకుడికి దేహశుద్ధి చేసి, కాకతీయ యూనివర్సిటీ పోలీసులకు అప్పగించారు. పోలీసులు యువకుడిని అదుపులోనికి తీసుకున్నారని కేయూ హాస్టళ్ల డైరెక్టర్ శ్రీనివాస్‌రావు తెలిపారు. ఆ యువకుడు ఎక్కడినుంచి వచ్చాడనేది తెలియరాలేదు.

వలంటీర్లకు అభినందన



కేయూ క్యాంపస్: కేంద్ర ప్రభుత్వ యువజన, క్రీడల మంత్రిత్వశాఖ, జాతీయ సేవాపథకం (ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో ఈనెల 22నుంచి 28వ తేదీ వరకు కర్ణాటకలోని జనపదలోక రామనగర ప్రాంతంలో నిర్వహించే జాతీయ సమైక్యత శిబిరానికి 10మంది ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ఎంపికయ్యారు. ఈనేపథ్యంలో ఎంపికైన ఎన్ఎస్ఎస్ వలంటీర్లను గురువారం కేయూ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఆచార్య నారాయణ, ప్రవీణ్‌కుమార్, రాధిక అభినందించారు.

గాదె హర్షితకు..

ఖిలా వరంగల్: వరంగల్ రంగశాయిపేట కాపువాడకు చెందిన ఎన్‌సీసీ కేడెట్ గాదె హర్షిత ఢిల్లీ ఎర్రకోటలోని ప్రత్యేక పరేడ్‌లో పాల్గొని ప్రధాని మోదీ ప్రశంసలు అందుకుంది. ఈమేరకు గురువారం రంశాయిపేటలో హర్షితను కాంగ్రెస్ నేత దామరకొండ కరుణాకర్, అశోక్, కిరణ్, చంద్రశేఖర్ తదితరులు సత్కరించారు.

నీటి వృథాను అరికట్టాలి

విద్యారణ్యపురి: నీటి వృథాను అరికట్టాలని, జల సంరక్షణపై అవగాహన అవసరమని స్విట్జర్లాండ్‌కు చెందిన శాస్త్రవేత్త శ్రీనివాస్ అన్నారు. గురువారం ప్రపంచ జల సంరక్షణ దినోత్సవ సందర్భంగా కాకతీయ ప్రభుత్వ కళాశాల రసాయన విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజారెడ్డి, రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ రమేష్, అధ్యాపకులు డాక్టర్ మల్లయ్య , కందాల సత్యనారాయణ, అశోక్, మొగిలి పాల్గొన్నారు.

ఫిర్యాదు

కాజీపేట అర్బన్: వరంగల్ ఆర్వో రిజిస్ట్రేషన్ కార్యాలయంలోని సబ్ రిజిస్ట్రార్ రాజుపై మడికొండకు చెందిన యువకుడు మాట్ల వంశీతేజ గురువారం తెలంగాణ సీఎంకు ట్విటర్ (ఎక్స్) వేదికగా ఫిర్యాదు చేశారు. వంశీతేజ కథనం ప్రకారం... తన తండ్రి మాట్ల పెద్ద యాదగిరి, తల్లి రాజేశ్వరి నాలుగేండ్ల క్రితం మృతి చెందారు. తాను తన అక్కతో తండ్రి నిర్మించిన ఇంట్లో ఉంటున్నాడు. ఈక్రమంలో తన తాత సంపాదించిన భూమిని తండ్రితోపాటు ముగ్గురు బాబాయిలు పెద్ద మనుషుల సమక్షంలో పంచుకున్నారు. పంపకాలకు విరుద్ధంగా ఈనెల 15వ తేదీన ముగ్గురు బాబాయిలు తమకు తెలియజేయకుండా అక్రమంగా సబ్ రిజిస్ట్రార్ రాజు చొరవతో భూమి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. తన తండ్రి వాటా అయిన (వంశీతేజ ఉండే ఇల్లు)ఇంట్లో నుంచి సైతం బయటికి వెళ్లిపోవాలని బెదిరిస్తున్నారని, తనకు న్యాయం చేయాలని సీఎంకు ట్వీట్ చేసినట్లు తెలిపాడు.

కలెక్టర్‌ను కలిసిన ఐపీఎస్ అధికారి



కరీమాబాద్ : ఐపీఎస్ అధికారి అంకిత్‌కుమార్ వరంగల్ కలెక్టర్ ప్రావీణ్యను గురువారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. 2020 బ్యాచ్‌కు చెందిన అంకిత్‌కుమార్‌ను వరంగల్ పోలీస్ కమిషనరేట్‌కు కేటాయించారు.

పీఏసీఎస్ చైర్మన్‌పై అవిశ్వాసం?

- బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి డైరెక్టర్ల జంప్
- పలువురు డైరెక్టర్ల రహస్య సమావేశం

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం మల్లారెడిపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానానికి రంగం సిద్ధమైనట్లు తెలుస్తుంది. ఈమేరకు సహకార సంఘం సభ్యులు నగరంలోని ప్రాంతంలో గురువారం రహస్య సమావేశం ఏర్పాటు చేసుకున్నట్లు తెలిసింది. అవిశ్వాసం పెట్టాలని సభ్యులు నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. ఈవిషయాన్ని స్థానిక ఎమ్మెల్యే కే.ఆర్.నాగరాజుకు వివరించినట్లు తెలిసింది. మల్లారెడ్డిపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో మొత్తం



పీఏసీఎస్ కార్యాలయ భవనం

13 మంది సభ్యులు ఉన్నారు. మల్లారెడ్డిపల్లి గ్రామం నుంచి ముగ్గురు, అర్వపల్లి నుంచి ఒకరు. హరిశ్చంద్రనాయక్ తండా నుంచి ఒకరు, సిద్దాపురం నుంచి నలుగురు, సూదన్‌పల్లి నుంచి ఇద్దరు సభ్యులు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ప్రస్తుతం అర్వపల్లి నుంచి డైరెక్టర్‌గా ఎన్నికైన జక్కు రమేష్ చైర్మన్‌గా కొనసాగుతున్నారు. 13 మంది సభ్యులు బీఆర్ఎస్ పార్టీకి చెందిన వారే. అయితే తాజా పరిణామాల నేపథ్యంలో పది మంది సభ్యులు కాంగ్రెస్‌లో చేరగా.. ఇద్దరు బీఆర్ఎస్‌లోనే కొనసాగుతున్నారు. చైర్మన్ జక్కు రమేష్ మాత్రం ఇటీవల బీజేపీలో చేరారు. కాగా, మెజార్టీ సభ్యులు కాంగ్రెస్‌లో చేరడంతో అవిశ్వాసం పెట్టడానికి ముందుకొచ్చారు. ఇదిలా ఉండగా.. చైర్మన్ కోసం మల్లారెడ్డిపల్లికి చెందిన మేడిపల్లి మధన్‌గౌడ్, గుండా ప్రభాకర్‌లు పోటీ పడుతున్నట్లు సమాచారం. అయితే అవిశ్వాస తీర్మానం కోసం ఈనెల 26న పీఏసీఎస్ సభ్యులు డీసీఓను కలువనున్నట్లు తెలిసింది. ప్రస్తుతం డీసీఓ సెలవులో ఉన్నారు.

ఉపాధి అవకాశాలు వినియోగించుకోవాలి

హన్మకొండ: స్వశక్తితో స్వయం ఉపాధి పొందుతూ మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని ఉషా ఇంటర్నేషనల్ డిప్యూటీ మేనేజర్ రాజ్ కుమార్ సూచించారు. సర్వోదయ యూత్ ఆర్గనైజషన్ ఆధ్వర్యంలో గురువారం హనుమకొండ రాంనగర్‌లో రిసోర్స్ పర్సన్ శిక్షణ కార్యక్రమంలో రాజ్ కుమార్ మాట్లాడారు. గత 13 సంవత్సరాలుగా ఉష ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో దేశంలో దాదాపు 12 లక్షల మంది మహిళలకు స్వయం ఉపాధి శిక్షణ ఇచ్చామని తెలిపారు. తెలంగాణలో సర్వోదయ యూత్ ఆర్గనైజషన్ ఆధ్వర్యంలో 465 ఉషా సిలాయి స్కూల్స్ ఏర్పాటు చేశామన్నారు. గ్రామీణ పేద మహిళలకు ఉపాధి పెంపొందించుటకు ఉషా ఇంటర్నేషనల్ వారు ఉచితంగా టైలరింగ్‌లో మెళుకువలు, కుట్టు మెషిన్ రిపేరింగ్‌లో శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ కార్యదర్శి పల్లెపాడు దామోదర్ మాట్లాడుతూ.. సంస్థకు సహకరిస్తున్న ఉషా ఇంటర్నేషనల్ వారికి కృతజ్ఞతలు తెలిపారు. విశ్వకర్మ యోజన పథకంలో నమోదు చేసుకోవడం ద్వారా కుట్టు మిషన్ శిక్షణ పొందిన మహిళలు మాస్టర్ ట్రైనర్లుగా అవకాశాలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ కవిరాజ్, జ్యోత్స్న, సతీష్, రవీందర్, మంజుల, అనిత, లావణ్య, అరుణ, విమల, శ్రీలత, తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న రాజ్ కుమార్

ఎల్బీ కళాశాలలో క్రీడాపోటీలు



క్రీడాకారులతో కరచాలనం చేస్తున్న ప్రిన్సిపాల్

రామన్నపేట : వరంగల్ ములుగు రోడ్డులోని లాల్ బహదూర్ కళాశాలలో గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలను పురస్కరించుకుని కళాశాలలో క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణ డీ.హెచ్.రావు తెలిపారు. క్రీడా పోటీలను ప్రారంభించిన సందర్భంగా ఆమె మాట్లాడారు. 50 సంవత్సరాల కళాశాల చరిత్రలో ఎంతో మంది క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని కళాశాలకు గొప్ప పేరు ప్రఖ్యాతాలు సాధించి పెట్టారని తెలిపారు. ఈ సందర్భంగా కబడ్డీ, బాస్కెట్‌బాల్, 2.5 కిలో మీటర్ రన్నింగ్ పోటీలు జరుగుతాయని తెలిపారు. ఎన్ఐటీ, కిట్స్ బీమారం, ఎస్సార్ యూనివర్సిటీ, కేయూ టీపీడీ, ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీతోపాటు, పలు కళాశాలల విద్యార్థులు పోటీల్లో పాల్గొంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ భుజేందర్‌రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ ప్రభాకర్, కళాశాల అధ్యాపకులు రమణారెడ్డి, రాజేశ్వర్‌రావు, శృతి. రజిని, రాఘవేందర్‌రెడ్డి, డాక్టర్ సదానందం పాల్గొన్నారు.

గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధచూపాలి

గీసుకొండ : పల్లె దవాఖాన వైద్యులు గర్భిణుల ఆరోగ్యంపై శ్రద్ధ చూపి మెరుగైన వైద్య సేవలు అందించాలని వరంగల్ డీఎంహెచ్ఓ డాక్టర్ కె.వెంకటరమణ అన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో పల్లె దవాఖానా వైద్యులతో గురువారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. మాతాశిశు సంరక్షణ కార్యక్రమంలో భాగంగా గర్భిణుల వివరాలను నమోదు చేసి, వారికి మూడు పరీక్షలు ఉచితంగా నిర్వహించాలన్నారు. ఉచితంగా ధనుర్వాతం టీకా, ఐరన్ పోలిక్ యాసిడ్ ట్యాబ్లెట్లను అందించాలని సూచించారు. ప్రభుత్వ దవాఖానల్లో ప్రసవించే విధంగా వారిని మానసికంగా సిద్ధం చేయాలన్నారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో అనవసరమైన సిజేరియన్లు, అబార్షన్లు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్ఓ వెంకటరమణ హెచ్చరించారు. ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలు రిజిస్ట్రేషన్లు చేయించుకుని నిబంధనల ప్రకారం వైద్య సేవలు అందించాలన్నారు. గర్భిణులకు లింగ నిర్ధారణ పరీక్షలు చేసేవారిపై కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ సుధార్‌సింగ్, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ గోపాల్‌రావు, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ప్రకాశ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటరమణ

అప్పారి వెంకటస్వామి ఆదర్శనీయుడు

విద్యారణ్యపురి: ఉమ్మడి ఏపీలో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి టీఎస్‌యూటీఎఫ్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి అప్పారి వెంకటస్వామి ఎనలేని పోరాటాలు చేశారని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సోమశేఖర్ అన్నారు. గురువారం టీఎస్‌యూటీఎఫ్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి వెంకటస్వామి 23వ వర్ధంతిని పురస్కరించుకొని ఆసంఘం జిల్లా కార్యాలయంలో నివాళులర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వెంకటస్వామి పోరాట పటిమ నేటి తరం ఉపాధ్యాయులకు ఎంతో ఆచరణీయమన్నారు. పెండెం రాజు, సుజన్‌ప్రసాద్‌రావు, రవీందర్‌రాజు, దామోదర్, మల్లిక్, శ్రీనివాస్, రవీందర్, చంద్రయ్య, కరుణాకర్, రేణుక, శ్రీనివాస్, సత్యనారాయణ పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న సంఘం బాధ్యులు

అన్ని మతాలను గౌరవిద్దాం..



మాట్లాడుతున్న ఏసీపీ దేవేందర్‌రెడ్డి

వరంగల్ క్రైం: సమాజంలోని ఇతర మతాలను గౌరవిస్తూ పండుగలను జరుపుకుందామని హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి అన్నారు. రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని గురువారం నగరంలోని సుబేదారి స్వాగత ఫంక్షన్ హాల్‌లో హనుమకొండ డివిజనల్ పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన పీఎస్ కమిటీ సమావేశంలో ఏసీపీ మాట్లాడారు. శాంతిని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. పోలీసుల సూచనలను తప్పక పాటించాలని కోరారు. వేడుకలు మనుషుల మధ్య బంధాలు పెంచేవిగా ఉండాలని ఏసీపీ సూచించారు. ఈ కార్యక్రమంలో సుబేదారి, హనుమకొండ, కేయూ పోలీస్ ఇన్‌స్పెక్టర్లు సత్యనారాయణరెడ్డి, సతీష్, సంజీవ్, అన్ని మతాలకు చెందిన మత పెద్దలు పాల్గొన్నారు.

అలరించిన సప్త వసంతోత్సవం

హన్మకొండ: హనుమకొండలోని అంబేడ్కర్ భవన్‌లో గురువారం రాత్రి జరిగిన వికాస్‌నగర్‌లోని కౌటిల్య స్కూల్ సప్త వసంతోత్సవం అలరించింది. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు ఆకట్టుకున్నాయి. విభిన్న రీతుల కళా ప్రదర్శనలతో విద్యార్థులు ఆద్యంతం కనువిందు చేశారు. ఈ కార్యక్రమాన్ని కౌటిల్య స్కూల్ కరస్పాండెంట్ కె.అశోక్ రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. ప్రాథమిక స్థాయి నుంచి విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శాలిని, డైరెక్టర్ వర్మ, డ్యాన్స్ మాస్టర్ ఆజాద్ పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న విద్యార్థులు

పౌరసత్వ బిల్లును రాజకీయం చేయొద్దు

హసన్‌పర్తి: పౌరసత్వ సవరణ బిల్లుపై రాజకీయం చేయొద్దని కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్ కోరారు. హసన్‌పర్తిలోని బీజేపీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఏఏ అనేది భారతీయ ముస్లింకు సంబంధించిన బిల్లు కాదన్నారు. పాకిస్తాన్, బంగ్లాదేశ్, అఫ్గనిస్తాన్ లాంటి ముస్లిం మెజార్టీ దేశాల్లో ఉన్న హిందువులు, సిక్కులు, బౌద్దులు, జైనులు, క్రైస్తవులు భారతదేశానికి వలస వచ్చి ఎన్నో ఏళ్లుగా ఇక్కడే స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్న వారిని భారత పౌరులుగా గుర్తింపు ఇవ్వడానికి తెచ్చిందే అని పేర్కొన్నారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాంచంద్రారెడ్డి, చకిలం రాజేశ్వర్‌రావు, తిరుపతి, దాసరి రాజు, హరిశంకర్, శ్యాంసుందర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కార్పొరేటర్ శివకుమార్

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత



కార్యక్రమంలో మాట్లాడుతున్న వీసీ రమేశ్

కేయూ క్యాంపస్: అధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత సాధ్యమని కాకతీయ విశ్వవిద్యాలయం వీసీ తాటికొండ రమేశ్ అన్నారు. విశ్వవిద్యాలయ పరిపాలనా భవనంలోని సెనెట్‌హాల్‌లో గురువారం శ్రీ రామచంద్ర మిషన్, హార్ట్‌ఫుల్‌నెస్ ఇన్‌స్టిట్యూట్, కన్హా శాంతివనం, హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో రిజిస్ట్రార్ ఆచార్య మల్లారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ధ్యానం, రిలాక్సేషన్, స్వచ్ఛతలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో వీసీ మాట్లాడారు. ప్రస్తుత కాలంలో ప్రశాంతత తప్పనిసరి అన్నారు. కార్యక్రమంలో విశ్రాంత ఐపీఎస్ అధికారి డాక్టర్ ఆదిత్యఆర్య కీలక ఉపన్యాసం చేశారు. అమెరికా సంయుక్త రాష్ట్రాల నుంచి వచ్చిన డాక్టర్ అరిహంత మాధవ మోహన్ , లోకల్ ఇన్‌చార్జ్ శారద, రమణ, ఆచార్య గార్లపాటి అచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

బోడగుట్ట ప్రాంతంలో తాగునీటి సమస్య తీర్చండి

కాజీపేట రూరల్: గ్రేటర్ వరంగల్ 47వ డివిజన్ బోడగుట్ట ప్రాంతంలో ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని గురువారం సికింద్రాబాద్ రైల్వే అధికారులను కలిసి ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి లేఖతోపాటు వినతి పత్రం అందజేశారు. బోడగుట్ట ప్రజల నీటి సమస్య గత ప్రభుత్వం పరిష్కరించకుండా పెడచెవిన పెట్టి కాలయాపన చేసిందని, ప్రజలు ఇబ్బంది పడుతున్నారని నీటి సమస్యపైన ప్రత్యేక దృష్టి సారించి రైల్వే డీఆర్ఎం, డీఈఎన్‌ను కలువాలని సూచించగా కలిసినట్లు మాజీ కార్పొరేటర్ గుంటి కుమార్, మాజీ డివిజన్ అధ్యక్షుడు దొంగల కుమార్, టీపీసీసీ సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శి బైరబోయిన రమేష్ యాదవ్ తెలిపారు. బోడగుట్ట ప్రాంతానికి రైలు పట్టాలు ఉండటం వల్ల మంచినీటి పైప్‌లైన్ సమస్యగా మారిందని తెలిపారు. పైప్‌లైన్‌కు కనెక్షన్ ఇచ్చేలా రైల్వే నుంచి సహకరించాలని సికింద్రాబాద్ సీనియర్ డీఈఎన్ సౌత్ దినకర్ ప్రణీత్‌కు ఎమ్మెల్యే లేఖ, వినతి పత్రం అందజేసి కోరినట్లు వారు తెలిపారు.



వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

సఖి కేంద్రాన్ని వినియోగించుకోవాలి

హన్మకొండ: సఖి కేంద్రం సేవలను మహిళలు ఉపయోగించుకోవాలని ఆ కేంద్రం కేస్ వర్కర్ వినీల సూచించారు. హనుమకొండ వికాస్‌నగర్‌లో గురువారం నిర్వహించిన మహిళా అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్, మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సఖి వన్ స్టాప్ సెంటర్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సఖి వన్ స్టాఫ్ కేంద్రం ద్వారా మహిళలకు ఉచితంగా సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. వరకట్నం, లైంగిక వేధింపులు, ఆడపిల్ల వద్దని అకారణంగా గర్భవిచ్ఛిత్తి చేయించాలని వేధింపులకు గురి చేయడం, వివిధ కారణాలతో వేధింపులకు గురవుతూ మానసికంగా కృంగి పోతున్న మహిళలు, బాలికలకు రక్షణ కల్పించేందుకు సఖి వన్ స్టాప్ కేంద్రం కృషి చేస్తుందన్నారు. సమస్యలపై సహాయం కోసం వచ్చిన మహిళలకు ఉచితంగా కౌన్సిలింగ్, న్యాయ, పోలీస్, వైద్య సాయం, తాత్కాలిక వసతి కల్పిస్తున్నామని వివరించారు. సాయం కోసం 0870-2452112 లేదా టోల్ ఫ్రీ నంబర్ 181కు ఫోన్ చేయాలని చెప్పారు. సఖి కేంద్రం పారామెడికల్ సరిత, లావణ్య పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న వినీల

పద్మశాలి విద్యార్థులకు ఆర్థిక సాయం

కాజీపేట అర్బన్: హంటర్‌రోడ్డులోని బీసీ నేత హాస్టల్‌లో గురువారం తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో నిరుపేద పద్మశాలి విద్యార్థులకు ఆర్థిక సాయం అందజేశారు. కమలాపురం గ్రామానికి చెందిన గొడిసు కార్తీక్ జయ నర్సింగ్ కళాశాలలో ఎంఎల్టీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. పరకాలకు చెందిన మెరుగు జ్యోతి గ్రూప్- 1, 2 పోటీపరీక్షలకు సిద్ధమవుతుండగా.. ఖర్చుల నిమిత్తం ఒక్కొక్కరికి రూ.40వేలు అందజేసినట్లు సంఘం అధ్యక్షుడు కోడం రవిప్రకాష్ తెలిపారు. ధర్మదేవ్, సత్యనారాయణ, మాధవి పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



దయాకర్

రామన్నపేట: వరంగల్ కొండూరి వీధికి చెందిన 57 సంవత్సరాల వ్యక్తి జంద్యం దయాకర్ బుధవారం ఉదయం నుంచి కనపడడం లేదు. దీంతో ఆయన కుమారుడు అఖిలేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ గోపి తెలిపారు. ఆచూకి తెలిసిన వారు 87126 85117, 87126 85005, అఖిలేష్ 95730 15480 నంబర్లకు సమాచారం అందించాలని సీఐ కోరారు.

ఏటీఎం ధ్వంసం.. కేసు నమోదు

రామన్నపేట: ఎంజీఎం జంక్షన్ సమీపంలోని ఎస్‌బీఐ ఏటీఎంను ఈ నెల 10వ తేదీన గుర్తు తెలియని దుండగులు ట్యాపరింగ్ చేసి రూ.10వేలు దొంగతనం చేయడంతోపాటు రూ.90వేల విలువ గల ఏటీఎంను ధ్వంసం చేసినట్లు గురువారం ఎస్‌బీఐ మేనేజర్ భిక్షపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తుమ్మ గోపి తెలిపారు. ప్రజలు ఏటీఎంకు వెళ్లి డబ్బులు విత్ డ్రా చేస్తున్న సందర్భంలో డబ్బులు రాకపోతే వెంటనే మీ పరిసరాలను గమనించి, అనుమానిత వ్యక్తులు సంచరిస్తే డయల్ 100 ద్వారా పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

రెడ్‌క్రాస్‌లో రక్తదాన శిబిరం

హన్మకొండ అర్బన్ : తలసేమియా బాధితులను కాపాడేందుకు గాజుల రాఘవకృష్ణ ఆధ్వర్యంలో నగరంలోని రెడ్‌క్రాస్ రక్తదాన కేంద్రంలో గురువారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ రక్తదాన శిబిరాన్ని రెడ్‌క్రాస్ వైస్ చైర్మన్ పెద్ది వెంకటనారాయణగౌడ్ ప్రారంభించి, మాట్లాడారు. తలసేమియా బాధితుల కోసం రక్తదానం చేసిన దాతలను, శిబిరాన్ని ఏర్పాటు చేసిన నిర్వాహకులను అభినందించారు. అనంతరం రక్తదాతలకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. రెడ్‌క్రాస్ జీవితకాల సభ్యుడు రడం కృష్ణమూర్తి, మెడికల్ ఆఫీసర్ మొహమ్మద్ తహర్ మసూద్, సురేష్, శ్రీనివాస్, శివకుమార్, పవన్, వాహిని, యాకయ్య, ప్రవీణ్, శివప్రసాద్, రాంబాబు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు..

హసన్‌పర్తి: చింతగట్టు, ఎల్లాపురం సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో నేడు(శుక్రవారం) విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీ గంగారెడ్డి గురువారం తెలిపారు. ఎస్సీఆర్ పాఠశాల ఏరియా, నారాయణనగర్, మంత్రపురికాలనీ, బస్వారెడ్డి టౌన్ షిప్, కిట్స్, కస్తూర్బా గాంధీ పాఠశాల, గ్రీన్‌వుడ్ దత్తాత్రేయ కాలనీల్లో శుక్రవారం సాయంత్రం 4గంటల నుంచి సాయంత్రం 6.30గంటల వరకు కరెంట్ సరఫరా ఉండదని తెలిపారు.

వ్యూహాలు రూపొందించాలి

హసన్‌పర్తి: విద్యార్థులు తమ పాఠ్యపుస్తకాల్లో పొందపరిచిన సిద్ధాంతాలను ఉపయోగించి వ్యూహాల్ని రూపొందించి అవలంభించడం ద్వారా భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారని స్పెరిడియన్ టెక్నాలజీ లిమిటెడ్ సీనియర్ డైరెక్టర్ నాగ శ్రీధర్ సూచించారు. అన్నాసాగరం శివారులోని ఎస్సార్ విశ్వవిద్యాలయం వేదికగా 'వ్యూహ-2024' పేరుతో మేనేజ్‌మెంట్ ఫెస్ట్‌ను గురువారం స్కూల్ ఆఫ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించారు. స్కూల్ ఆఫ్ బిజినెస్ విభాగాధిపతి డాక్టర్ రాజ్యలక్ష్మి, డీన్ సుమన్, ప్రోగ్రాం కోఆర్డీనేటర్ డాక్టర్ సుధాకర్, రిజిస్ట్రార్ అర్చనారెడ్డి ఉన్నారు.

జీఓను సవరించాలి

హన్మకొండ చౌరస్తా: పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనాల జీఓను సవరించాలని కోరుతూ ఆల్‌షాప్స్ వర్కర్స్ యూనియన్ బాధ్యులు గురువారం హనుమకొండ కలెక్టరేట్‌లోని కార్మికశాఖ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ రమేష్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు రామస్వామి మాట్లాడారు. మహబూబ్, రాఘవులు, కుమారస్వామి ఉన్నారు.

వాటర్ ప్యూరిఫైడ్ మిషన్ అందజేత

కాశిబుగ్గ: నగరంలోని ఎల్‌బీనగర్ మాసూమ్ అలీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు ఎన్ఆర్ఐలు వడ్డెపల్లి శివకుమార్, శ్రీవాణి దంపతులు లయన్స్‌క్లబ్ ఆఫ్ వరంగల్ స్పోర్ట్స్ ఆధ్వర్యంలో గురువారం రూ.40 వేల విలువ గల వాటర్ ప్యూరిఫైడ్‌ను అందజేశారు. పాఠశాల ఉపాధ్యాయులు, క్లబ్ సభ్యులు దాతలను సన్మానించారు. క్లబ్ అధ్యక్షుడు ఉదయ్ భాస్కర్, మహేశ్వర్, సుభాష్, రాజీవ్‌భాను, రాజు , సురేందర్, రమణయ్య, వేణుగోపాల్, హెచ్ఎం బీవీఎస్ స్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మిర్చి బండిపై పాము కలకలం

కాజీపేట: కాజీపేటలోని బాపూజీనగర్ చౌరస్తాలో ఓ మిర్చి బండిపైకి గురువారం పాము కలకలం సృష్టించింది. చిరు వ్యాపారి సయ్యద్ ఖాదీర్ మిర్చిలు, గారెలు వేస్తున్న సమయంలో పాము బండిపై పడగ విప్పడంతో భయాందోళనలకు గురయ్యారు. స్నేక్ క్యాచర్ సిరాజ్‌కు సమాచారం ఇవ్వగా పామును చాకచక్యంగా పట్టుకుని అటవీ ప్రాంతంలో వదిలేశారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

వరంగల్ క్రైం: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో శాంతి భద్రలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని ఇన్‌స్పెక్టర్ సతీష్ అన్నారు. హనుమకొండ పోలీస్ స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ సతీష్ ఆధ్వర్యంలో గురువారం రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

ప్రత్యేక అలంకరణలో ఆదిగణపతి

కాజీపేట: కాజీపేట 62వ డివిజన్ విష్ణుపురి కాలనీ స్వయంభు శ్రీశ్వేతార్క మూలగణపతి దివ్య క్షేత్రంలో కొలువుదీరిన ఆదిగణపతిని పసుపుతో అర్చకులు ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకుల పర్యవేక్షణలో అర్చకులు స్వామి వారికి పంచామృతాలతో అభిషేకాలు చేసి పసుపు, పూలు, నూతన వస్త్రాలతో అలంకరించారు.



నాగారం గ్రామంలో పోలీసుల కవాతు

హసన్‌పర్తి: నాగారం గ్రామంలో గురువారం కేంద్ర పోలీస్ బలగాలు స్థానిక పోలీసుల ఆధ్వర్యంలో కవాతు నిర్వహించాయి. గ్రామంలోని ప్రధాన రహదారుల గుండా ఈ కవాతు సాగింది. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఈకార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో పోలీస్ ఇన్‌స్పెక్టర్ సురేష్, ఎస్సైలు సురేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.



కవాతు నిర్వహిస్తున్న కేంద్ర పోలీసు బలగాలు